స్వయంభూ నారసింహస్వామికి నిత్యారాధనలు

స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య క్షేత్రంతో స్వయంభూ నారసింహస్వామికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సుదర్శన నారసింహ హోమం ఘనంగా జరిపారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి గజ వాహన సేవ నిర్వహించారు. మొదటి ప్రాకార మండపంలో తూర్పునకు అభిష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయం చెంతన గల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకు పూజ ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలితాపారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు. బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.10,39,750 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కు అందజేత

బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

వలిగొండ, ఆగస్టు 20 : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన చిప్పలపల్లి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో పార్టీ బీమా ద్వారా రూ.2లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం నర్సమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, నాయకులు వల్లమాల కృష్ణ, ఎండీ సలీం, కొంపల్లి సత్తయ్య, బర్ల నాగార్జున, మహేశ్ పాల్గొన్నారు.

పండుగలతో భక్తిభావం పెంపు

- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు స్వామి

రాజాపేట, ఆగస్టు 20 : పండుగలతో భక్తిభావం పెంపొందుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రఘునాథపురంలో బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కటకం స్వామి స్వగృహంలో మంగళవారం నిర్వహించిన ఎల్లమ్మ పండుగలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డికి కటకం స్వామి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, వెంకటేశం, మధుసూదన్‌రెడ్డి, నర్సిరెడ్డి, ఉప్పలయ్యగౌడ్, రాజు, నర్సింగరావు, సిద్ధిరాములు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

శ్రీరాములు కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ అందజేస్తున్న నాయకులు

బీబీనగర్, ఆగస్టు 20 : మండలంలోని మహదేవ్‌పూర్ గ్రామానికి చెందిన సంగిశెట్టి శ్రీరాములు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఆయన వైద్యం కోసం ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల ఎల్ఓసీ మంజూరైంది. ఎల్ఓసీని మంగళవారం స్థానిక నాయకులు శ్రీరాములు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురకంటి సత్తిరెడ్డి, దండెం ప్రభాకర్, గాండ్ల రమేశ్, ఎండీ జహంగీర్, కొండల్, శ్రీను పాల్గొన్నారు.

కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్పకు బోనాలు

ఆత్మకూరు(ఎం)లో బోనాలతో వెళ్తున్న మహిళలు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 20 : మండల కేంద్రంలో మంగళవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప బోనాలు నిర్వమించారు. ఈ సందర్భంగా డోలు వాయిద్యాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బీరప్ప దేవాలయంలో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాస కవిత, కురుమ సంఘం అధ్యక్షుడు మజ్జిగ రాంబాబు, భిక్షపతి, అశోక్ పాల్గొన్నారు.

రామన్నపేట ఏఓగా ఎజాజ్ అలీఖాన్ బాధ్యతల స్వీకరణ

శైలజ

ఎజాజ్ అలీఖాన్

కీర్తి

అరుణకుమారి

రామన్నపేట, ఆగస్టు 20 : మండల వ్యవసాయ అధికారిగా ఎండీ ఎజాజ్ అలీఖాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భూదాన్ పోచంపల్లి ఏఓగా పనిచేసిన ఆయన బదిలీపై రామన్నపేటకు వచ్చారు. రామన్నపేట ఏఓగా పనిచేసిన పద్మజ ఆలేరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎజాజ్ అలీఖాన్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మోత్కూరు : మండల ఏఓగా వడ్డెమాను కీర్తి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏఓ కె.స్వప్న రాజేంద్రనగర్‌లోని భూసార పరీక్ష కేంద్రానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో భువనగిరి జిల్లా వ్యవసాయ కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయాధికారిగా పని చేస్తున్న కీర్తి ఇక్కడికి వచ్చారు.

భూదాన్ పోచంపల్లి : మండల వ్యవసాయ అధికారిగా కె.శైలజ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాజేంద్రనగర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఆత్మకూరు(ఎం) : మండల వ్యవసాయ అధికారిగా బత్తుల అరుణకుమారి విధులు చేపట్టారు. అడ్డగూడూరు మండల ఏఓగా విధులు నిర్వహించిన ఆమె బదిలీపై వచ్చారు.

యాదగిరిగుట్ట : ఉప్పల్ వ్యవసాయ అధికారి ఐ.సుధారాణి యాదగిరిగుట్ట ఏఓగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన రాజేశ్‌కుమార్ రాజేంద్రనగర్‌లోని రైతు శిక్షణ కేంద్రానికి బదిలీ అయ్యారు.

పోటెత్తిన మూసీ

- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం

భూదాన్ పోచంపల్లి : జూలూరు – రుద్రవెల్లి బ్రిడ్జి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 20 : హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. భూదాన్ పోచంపల్లి మండలంలో జూలూరు – రుద్రవెల్లి గ్రామాల మధ్య ఉన్న లో లెవెల్ బ్రిడ్జి పైనుంచి వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో భూదాన్ పోచంపల్లి – బీబీనగర్ మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనపైకి వాహనాలను పోలీసులు అనుమతించడం లేదు. పొలాల్లో వరద పారుతుండడంతో యువకులు చేపల వేట కొనసాగిస్తున్నారు.

రుద్రవెల్లి మూసీ వంతెన మూసివేత

బీబీనగర్ : హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని రుద్రవెల్లి గ్రామంలో మూసీ వంతెన పైనుంచి వరద ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో బీబీనగర్ – పోచంపల్లి మండలాల మధ్య రాకపోకలు బందయ్యాయి. భద్రతా చర్యల్లో భాగంగా తాసీల్దార్ శ్రీధర్ అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బారికేడ్లు ఏర్పాటు చేసి వంతెనను మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున రాత్రివేళ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సంగెం వద్ద రాకపోకలకు అంతరాయం

వలిగొండ : ఎగువన సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నదికి వరద పోటెత్తింది. మండలంలోని సంగెం గ్రామం భీమలింగం కత్వ వద్ద ఉన్న లోలెవల్ వంతెన పైనుంచి మూసీ వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సంగెం – బొల్లేపల్లి గ్రామాల మధ్య వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజా రవాణా పూర్తిగా నిలిచిపోయింది. స్థానిక పోలీసులు ముందు జాగ్రత్తగా ప్రమాదాల నివారణకు ప్రత్యేక పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. మూసీ నది వైపు ప్రయాణికులు, వాహనదారులు వెళ్లకుండా చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

యాదగిరిగుట్ట : రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న చొల్లేరు వాగు

ప్రవహించిన చొల్లేరు వాగు

యాదగిరిగుట్ట : పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 170.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో పలు చెరువుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. మండలంలోని చొల్లేరు వాగు ప్రవహించింది. దీంతో గ్రామానికి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా, కొద్దిరోజులుగా వర్షం లేకపోవడంతో వరి, పత్తి పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. తాజాగా కురిసిన వర్షానికి పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు సంతోష పడుతున్నారు.

వలిగొండ : సంగెం – బొల్లేపల్లి గ్రామాల మధ్య మూసీ నదిపై ఉన్న లో లెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద

బీబీనగర్ : రుద్రవెల్లి మూసీ వంతెన వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు, పోలీసులు

బీఆర్ఎస్ నుంచి రామచంద్రారెడ్డి సస్పెండ్

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 20 : మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ రైతు విభాగం నాయకుడు వారాల రామచంద్రారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున రామచంద్రారెడ్డిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

బైరాంనగరం కురుమ సంఘం అధ్యక్షుడిగా మల్లేశం

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆలేరు రూరల్, ఆగస్టు 20 : మండలంలోని బైరాంనగరం కురుమ సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నంద మల్లేశం, ఉపాధ్యక్షుడిగా గవ్వల ప్రభాకర్, కార్యదర్శిగా గవ్వల యాదగిరి, సహాయ కార్యదర్శులుగా నంద నర్సింహులు, గవ్వల చిన్న భూమయ్య, పెద్ద భూమయ్య, మల్లేశం, చిమ్మి బాలయ్య, మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బీబీనగర్, ఆగస్టు 20 : రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతిచెందాడు. ఎస్ఐ ఎన్.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రహీంఖాన్‌గూడెం గ్రామానికి చెందిన సాయికిరణ్ నాయక్ (19) మంగళవారం ఉదయం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బీబీనగర్‌కు వచ్చాడు. తిరిగి గ్రామానికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో సాయికిరణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వెంటనే వచ్చి భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సాయికిరణ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 20 : మండలంలోని రహీంఖాన్‌పేటలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుంప ఇన్నయ్య కుతూరు రేణుక అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో అందజేసిన రూ.5వేలను స్థానిక నాయకులు అందజేశారు. ఇన్నయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సుదగాని లింగయ్య, నాయకులు అంజయ్య, ఐలయ్య, నరేశ్, మహేశ్, మల్లయ్య, శివయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

- తాసీల్దార్ కార్యాలయం ఎదుట సికిందర్‌నగర్ వాసుల ఆందోళన

తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సికిందర్‌నగర్ గ్రామస్తులు

మోటకొండూర్, ఆగస్టు 20 : మండలంలోని సికిందర్‌నగర్ గ్రామంలో గల ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరారు. ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిపైనా, వారికి సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని తాసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో 533బీ సర్వే నెంబర్‌లో షేక్ ఖాసీంబీ పేరున ఉన్న సుమారు ఎనిమిది గుంటల భూమిని 50 సంవత్సరాల క్రితం గ్రామస్తులకు ఇచ్చారని, అందులో కొంతమంది ఇండ్లు కూడా కట్టుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. కొంత మంది డీఎస్ పెండింగ్ ఉండడంతో ధరణిలో తప్పుడు పత్రాలు, తప్పుడు వ్యక్తులను సృష్టించి ఫౌతీ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. ఆ భూమిని సర్వే చేసి అర్హులైన గ్రామస్తులకు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై తాసీల్దార్ శాంతిలాల్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిస్తే, సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పల్లెపహాడ్‌కు ఆర్టీసీ బస్సు పునఃప్రారంభం

పల్లెపహాడ్‌లో ఆర్టీసీ బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

తుర్కపల్లి, ఆగస్టు 20 : మండలంలోని పల్లెపహాడ్ గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. 5సంవత్సరాలుగా గ్రామానికి బస్సు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామస్తులు ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించగా.. కుషాయిగూడ డిపోకు చెందిన బస్సును ఏర్పాటు చేశారు. గ్రామానికి వచ్చిన బస్సుకు గ్రామస్తులు పూజలు చేసి స్వాగతం పలికారు. ఈ బస్సు ఈసీఎల్ నుంచి మాదాపురం, పల్లెపహాడ్ మీదుగా భువనగిరి వరకు వెళ్తుంది. బస్సు రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మాజీ సర్పంచ్ రాజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సురేందర్‌రావుకు ఆత్మీయ సత్కారం

సురేందర్‌రావును సత్కరిస్తున్న వివిధ పార్టీల నాయకులు, స్నేహితులు

రామన్నపేట, ఆగస్టు 20 : మండల కేంద్రానికి చెందిన బొడ్డు సురేందర్‌రావు నీటిపారుదల శాఖ ఈఈగా పనిచేస్తూ ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ నుంచి ఉత్తమ ఇంజినీర్ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఆయన ఆత్మీయులు, స్నేహితులు, వివిధ పార్టీల నాయకులు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద దళిత వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సురేందర్‌రావు ప్రభుత్వ హాస్టల్‌లో ఉండి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. ఆయనకు ఉత్తమ ఇంజినీర్ అవార్డు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మొగిలయ్య, పృథ్వీరాజ్, రాములు, శంకరయ్య, వెంకటేశం, అంజయ్య, స్వామి, రామస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం మండల నూతన కమిటీ

బీబీనగర్, ఆగస్టు 20 : ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల నూతన కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమిడి మాధవరెడ్డి అధ్యక్షతన మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పబ్బాల బాలరాజు, గౌరవాధ్యక్షుడిగా యాస నరసింహారెడ్డి, గౌరవ సలహాదారులుగా మొరిగాడి శ్రీనివాస్, నెల్లుట్ల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పొట్ట మనోహర్, తానేటి ప్రసన్నకుమార్, ప్రధాన కార్యదర్శిగా యంజాల రాజు, కోశాధికారిగా ఎలిమినేటి శ్రీకాంత్‌రెడ్డి, ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శిగా సురేశ్, కార్యవర్గ సభ్యులుగా దశరథ, నవీన్, శివ, కృష్ణ, లింగస్వామి, ప్రణీత్‌రెడ్డి, రాజేశ్, శేఖర్, రాజశేఖర్, నవీన్‌రెడ్డి ఎన్నికయ్యారు.

టెస్ట్ రిపోర్టులు అదే రోజు ఇవ్వాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ప్రభుత్వ ఏరియా దవాఖానలో రోగులతో వసతులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి అర్బన్, ఆగస్టు 20 : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చే శాంపిల్స్‌ను పరీక్ష చేసి నివేదికలు అదే రోజు ఇవ్వాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే వైద్యాధికారులకు సూచించారు. జిల్లా ఏరియా ఆసుపత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్ట్రిక్ట్ హబ్ విభాగాన్ని మంగళవారం ఆయన సందర్శించి ల్యాబ్‌లో జరుగుతున్న పరీక్షల వివరాలను పరిశీలించారు. జిల్లాలోని 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చే శాంపిల్స్‌లో డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వైరల్ ఫీవర్లకు సంబంధించిన పాజిటివ్, నెగిటివ్ కేసులు ఎన్ని వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల వివరాలను అదే రోజు అందించాలని, తద్వారా కేసులు బయటపడిన ప్రాంతాలకు వైద్య బృందాలను సకాలంలో పంపి వ్యాధుల నివారణకు కృషి చేయాలని సూచించారు. దవాఖానలో రోగులకు సౌకర్యాలు, వైద్యుల పర్యవేక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, డాక్టర్ చిన్నునాయక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

వయ్యారిభామ మొక్కల నిర్మూలనపై అవగాహన

వయ్యారిభామ మొక్కల నివారణపై వివరిస్తున్న శాస్త్రవేత్త శ్రీదేవి

రాజాపేట, ఆగస్టు 20 : జాతీయ వరి పరిశోధన సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం వయ్యారిభామ కలుపు మొక్కలపై రైతులకు అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీదేవి మాట్లాడుతూ సమస్యాత్మక వయ్యారిభామ మొక్కలతో చర్మ సంబంధించిన వ్యాధులతోపాటు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వాటిని కలుపు మందుల వాడకంతో నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అపర్ణ, ఏఈఓ అంజయ్య, ప్రణీత, వివీత, రైతులు పాల్గొన్నారు.

షెడ్లను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు, బాధితులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 20 : పట్టణంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో నిరుపేదల దుకాణాల షెడ్లను జేసీబీతో కూల్చిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాధితులతో కలిసి అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 5గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు జేసీబీతో బాధితుల షెడ్లను ధ్వంసం చేశారని, ఇంతవరకూ నిందితులను గుర్తించలేదని అన్నారు. తక్షణమే దుండగులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేశ్, సబిత, బాధితులు అంజమ్మ, సుగుణమ్మ, సత్తెమ్మ, గౌరమ్మ, పెద్ద లక్ష్మమ్మ, చిన్న లక్ష్మమ్మ, ఎట్టమ్మ, విజయ, నాగమణి, లింగమ్మ, అంజయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలి

ఏఈఓలకు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

చౌటుప్పల్, ఆగస్టు 20 : అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పంట రుణం తీసుకున్న కొంతమందికే రూ.2లక్షల రుణమాఫీ అయ్యిందని, కానివారు బ్యాంకుల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

కార్యక్రమంలో నాయకులు గంగాదేవి సైదులు, బూర్గు కృష్ణారెడ్డి, చీరిక సంజీవ రెడ్డి, బండారు నర్సింహ, ఎండీ పాషా, చీరిక అలివేలు, జక్కిడి రాంరెడ్డి, మాసిరెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మమ్మ, పెంటారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

నీహెచ్‌సీ సూపరింటెండెంట్ స్వప్నరాథోడ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆరోగ్య మిత్రలు

ఆలేరు రూరల్, ఆగస్టు 20 : ఆరోగ్యశ్రీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆరోగ్య మిత్ర ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆలేరు నీహెచ్‌సీ సూపరింటెండెంట్ స్వప్నరాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య మిత్రలను తిరిగి నీహెచ్‌సీలోకి తీసుకోవాలని, టీఏ, డీఏ సౌకర్యం కల్పించి హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొగులగాని కాటమయ్య, నాయకులు శ్రీనివాస్, సుమ, ఇందిర పాల్గొన్నారు.

వైద్యురాలి హత్య కేసు దోషులను కఠినంగా శిక్షించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భిక్షపతి

ఆలేరు రూరల్, ఆగస్టు 20 : పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో జూనియర్ డాక్టర్‌పై గ్యాంగ్ రేప్ చేసి హత మార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మామిడాల భిక్షపతి డిమాండ్ చేశారు. ఆలేరులో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదన్నారు. మహిళలపై దాడులను నివారించడంలో పాలకులు విఫలం చెందుతున్నారని విమర్శించారు. మహిళలపై హత్యాచారం చేసిన దోషులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కళ్లెపు అడివయ్య, ఇక్కిరి సహదేవ్, స్వామి, సిద్ధేశ్వర్, భాస్కర్ పాల్గొన్నారు.